నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 7 మార్చి 2024 | MAHABUBNAGAR NARAYANPET

జడ్చర్ల తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలి

జడ్చర్ల, మార్చి 6 : ఎల్ఆర్ఎస్‌కు ఎలాంటి రుసుం తీసుకోకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద నామినల్ ఫీజు కట్టాలని చెప్పిందన్నారు. ఆనాడు కాంగ్రెస్ నాయకులు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని, ప్రజలమీద భారం మోపరాదని, తాము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దుచేస్తామని ప్రకటించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక డబ్బులు కట్టమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారం లేనప్పుడు ఒక మాట, ఉన్నప్పుడు ఒక మాట చెప్పడం వారికే చెల్లిందన్నారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితం చేయాలని, లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తాసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, పీఏసీసీఎస్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, మున్సిపల్ చైర్పర్సన్ లక్ష్మి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, కౌన్సిలర్లు లత, చైతన్య, దేవ, సతీశ్, జ్యోతి, రఘురాంగౌడ్, ముడా మాజీ డైరెక్టర్లు రవిశంకర్, ఇంతియాజ్‌ఖాన్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మురళి, నర్సింహులు, కృష్ణారెడ్డి, హఫీజ్, శ్రీను, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌యాదవ్, పర్మటయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

వనపర్తి, మార్చి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని చెప్పి నేడు డబ్బులు కట్టాలని చెబుతున్నదని, వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ముందుగా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు 420 హామీలను ఇచ్చిందని, ఇచ్చిన హామీలకు తిలోదకాలు ఇస్తూ ప్రజలపై భారం మోపేందుకు ప్రణాళికలు చేపట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ చార్జీలు లేకుండా ఉచితంగా చేయాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, నాయకులు కోళ్ల వెంకటేశ్, పాకనాటి కృష్ణ, పుట్టపాకుల మహేశ్, నాగన్నయాదవ్, గులాంఖాదర్, గంధం పరంజ్యోతి, అశోక్, నీలస్వామి, ఎర్రశ్రీను, తిరుమల్, రమేశ్‌నాయక్, ప్రేమ్, శ్రీనివాసులు, ఇంతియాజ్, రహీం, వెంకటేశ్, హేమంత్, గిరి, శరవంద, గోపాల్‌యాదవ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, వినోద్‌గౌడ్, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్

కల్వకుర్తి, మార్చి 6 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను నయవంచనకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ప్రజలకు పిలుపునిచ్చారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం కల్వకుర్తి పట్టణంలోని అమరవీరుల స్తూపం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచుతున్నదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని చెప్పి, దానిపై కేసులు వేసి అధికారం వచ్చాక డబ్బులు చెల్లించాలనే విధంగా మాట్లాడడం దారుణమన్నారు. రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, రైతు భరోసాతో ఎకరానికి రూ.15వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ యాసంగికి సంబంధించి ఇప్పటికీ రైతుల ఖాతాల్లో డబ్బులు వేయలేదని దుయ్యబట్టారు. పాత పద్ధతిలోనే డబ్బులు వేస్తామని చెప్పినా.. కేవలం మూడెకరాలకు మాత్రమే డబ్బులు వేశారని విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు ఇలా ఏవీ అమలు చే యలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌లో ముసలం పుట్టిందని.. అతి త్వరలో పార్టీ అంతమయ్యే పరిస్థితులు వస్తాయన్నారు. ప్రజలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు మధు, నాయకులు రాంరెడ్డి, వెంకటయ్య, అర్జున్‌రావు, పత్యానాయక్, సుభాష్, సూర్యప్రకాశ్‌రావు, భోజిరెడ్డి, శ్రీనివాసులు, సైదులు, ఖలీల్, శ్రీశైలం, జంగయ్య, చెన్నకేశవులు, గణేశ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 6 : శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది డిపోల నుంచి దాదాపు 256 ప్రత్యేక బస్సులు నడుస్తాయని, ఇప్పటికే అన్ని డిపోల నుంచి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు బస్సులు నడుస్తాయని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



షాపింగ్ మాల్‌లో చీరను ప్రదర్శిస్తున్న హీరోయిన్ మెహ్రీన్ పిర్జాదా

• గద్వాలలో కాసం షాపింగ్ మాల్ ప్రారంభం

మెరిసిన మెహ్రీన్

గద్వాల, మార్చి 6 : జిల్లా కేంద్రంలో సినిమా హీరోయిన్ మెహ్రీన్ పిర్జాదా సందడి చేశారు. గద్వాల పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తాలో ఏర్పాటు చేసిన కాసం షాపింగ్ మాల్‌ను బుధవారం ప్రారంభించారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్‌లో పట్టువస్త్రాలతోపాటు వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్నిరకాల వస్త్రాలు ఈ షాపింగ్ మాల్‌లో అందుబాటులో ఉన్నాయని, సరసమైన ధరలకే దుస్తులు లభిస్తాయని వివరించారు. షాపింగ్ మాల్ నిర్వాహకులు కాసం మల్లికార్జున, కేదారినాథ్, నమశ్శివాయ మాట్లాడుతూ ఫ్యాషన్ రంగంలో తమకు 78 ఏండ్ల అనుభవం ఉందన్నారు. సరసమైన ధరలకు వస్త్రాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. తెలంగాణలో 11వ బ్రాంచ్ గద్వాలలో ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాసం శివప్రసాద్, రఘురామరాజ బట్ల, కాసం ప్రేమ్‌కుమార్, కాసం సాయిగుప్తా, కాసం ప్రణీత్‌కుమార్, అరుణ్‌కుమార్, వరుణ్ విశాల్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా పొట్టేళ్ల పోట్లాట

- పోటీల్లో పాల్గొన్న 30 పొట్టేళ్లు
- మొదటి, రెండో విజేత హైదరాబాద్

తలపడుతున్న పొట్టేళ్లు

అయిజ, మార్చి 6 : పొట్టేళ్ల పోట్లాట రసవత్తరంగా సాగింది. అయిజ పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర పొట్టేళ్ల పోరు పోటాపోటీగా జరిగింది. తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి 30 పొట్టేళ్లు వచ్చాయి. మొదటి బహుమతి హైదరాబాద్‌కు చెందిన కిల్లర్ గ్రూప్ (రూ.50,016), రెండో బహుమతి హైదరాబాద్‌కు చెందిన డెక్కన్‌షిప్ ఫైటర్స్ (రూ.35,016), మూడో బహుమతి కర్నూల్ జిల్లా గొందిపర్లకు చెందిన ప్రభాస్ (రూ. 20,016), నాలుగో బహుమతి నంద్యాల జిల్లా ఆంధ్రకట్లకు చెందిన రమేశ్(రూ.10,016) పొట్టేళ్లు గెలుపొందాయి. విజేతల యజమానులకు ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు.

కల్వకుర్తి ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భగ్గుమన్న బీఆర్ఎస్

- 420 హామీలకు కాంగ్రెస్ తిలోదకాలంటూ ధ్వజం
- అబద్ధాలతో అందలమెక్కిన రేవంత్ సర్కారు
- ప్రజలకిచ్చిన ప్రతి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్
- ప్రభుత్వ తీరుపై గులాబీ నేతల కన్నెర్ర

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనల హోరు
- ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని డిమాండ్

అబద్ధాలతో అధికారంలోకి..

- హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వం
- ధాన్యం దొంగలను వదిలిపెట్టం
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, మార్చి 6 : ప్రజలకు ఆచరణలో అమలు కాని హామీలు, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలుపర్చాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్‌కు ఎలాంటి ఫీజులేకుండా ఉచితంగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీరం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ముందుగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాశ్‌రావు, ఎంపీపీలు కమలేశ్వర్‌రావు, రజితా భాస్కర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఆర్డీవో నాగరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం బీరం విలేకరులతో మాట్లాడుతూ హామీలను కాంగ్రెస్ తుంగలో తొక్కిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం ఎవరూ డబ్బులు చెల్లించొద్దని, తాము అధికారంలోకి వస్తే ఉచితంగా అమలు చేస్తామని నాడు హామీలిచ్చిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేడు వాటి ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. తమ ప్రభుత్వంలో ఒక న్యాయం మీ ప్రభుత్వంలో మరో న్యాయమా అని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లా నుంచి ముఖ్యమంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి సొంత గ్రామంలోని గోడౌన్ నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి నిల్వ ఉంచిన సీఎంఆర్ ధాన్యం బస్తాలను దోచుకెళ్లిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో అసలు దోషులను వదిలేసి కేవలం కూలీలను అరెస్ట్ చేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. సర్కారు ధాన్యం దొంగలించిన అసలు దొంగలను అరెస్ట్ చేసే వరకు తాము ప్రభుత్వం పై ఎంతటికైనా పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్‌సభ్యుడు మతీన్ అహ్మద్, మాజీ జెడ్పీటీసీ జంబులయ్య, సింగిల్‌విండో చైర్మన్ చింతకుంట శ్రీనివాసులు, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు రామచందర్‌యాదవ్, సత్యనారాయణగౌడ్, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ శంకర్‌నాయక్, కౌన్సిలర్ కృష్ణమూర్తి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రుక్మద్దీన్, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్, గుజ్జుల పరమేశ్, మూలే కేశవులు, సురేందర్‌రావు, కట్టా శ్రీనివాసులు, రాఘవేంద్ర, చంద్రశేఖర్‌శెట్టి, సాంబశివుడు యాదవ్, సాయిరాంయాదవ్, రామకృష్ణ, నిరంజన్, సురేందర్‌గౌడ్ తదితరులున్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు..

- ఎల్ఆర్ఎస్ ఫీజును రద్దు చేయాలి
- రుణమాఫీ ఊసెత్తని కాంగ్రెస్
- ఉద్యోగాలిచ్చామని ఫొటోలకు ఫోజులిస్తున్న సీఎం రేవంత్
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేట టౌన్, మార్చి 6 : హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పేర్కొన్నారు. 'ఓడ ఎక్కేదాకా ఓడ మల్లన్న.. ఓడ దిగాక బోడ మల్లన్న' అన్నట్లుగా ప్రభుత్వ వ్యవహార శైలి ఉందని ఎద్దేవా చేశారు. బుధవారం అచ్చంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గువ్వల మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ నాయకులు ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడుతున్నారు. ప్రజలకు హానీ తలపెట్టే నిర్ణయాలు తీసుకుంటే వారి తరపున పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు హామీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రుణమాఫీ, మహిళా భృతి, రైతు భరోసా, ఉద్యోగాల నోటిఫికేషన్‌కు సంబంధించి ఇచ్చిన హామీలు, అమలు చేస్తున్న తీరును ప్రజలు అప్పుడే ఛీత్కరిస్తున్నారని గుర్తు చేశారు. హామీలపై కాకుండా ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికలపై దృష్టిపెట్టి చాలా పెద్ద తప్పు చేస్తున్నారన్నారు. హామీలు నెరవేర్చకుండా ప్రజ లు ఏం చేస్తరు అనే దురహంకారంతో వ్యవహరిస్తే మా త్రం తగిన రీతిలో బుద్ధిచెప్తారన్నారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిరసనలకు పిలుపునిచ్చారని, కానీ నేడు ఎన్నికల కోడ్ అమలులో ఉందని పోలీసు, రెవె న్యూ అధికారులు అడ్డుకున్నారన్నారు. ఏ కోడ్ అమ ల్లో ఉన్నా.. ఎంత పెద్ద విపత్తు అడ్డు వచ్చినా ప్రజల మనోభావాలు వ్యక్తపరిచే హక్కు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ కల్పించిందని గుర్తు చేశారు. కానీ, ఈ రోజు నిరసనలకు పూనుకుందామనుకుంటే పోలీసులు ఫోన్ చేయడం లీగల్ యాక్ట్ ఉందని రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్తే వారు మాకు తెలియదు అనడం, ఇ చ్చిన రిప్రజెంటేషన్‌ను తిరస్కరించారన్నారు. మేమేమీ తప్పు చేయకపోయినా కాంగ్రెసేతరులు అనగానే వెంటాడి వేటాడి దాడి చేయడం, అక్రమంగా కేసులు పెట్టడం వంటివి ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన అచ్చంపేటలో జరుగుతున్నాయని ఆరోపించారు. నిరసనల విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే మొబైల్ ఫోన్లు ఇల్లీగల్ అని పోలీసుల ఆధీనంలో పెట్టుకొని కోర్టులో డిపాజిట్ చేస్తామని.. అక్కడికి వెళ్లి తీసుకోండంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వంతపాడుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, భట్టి ఇలా ఒక్కొక్కరు ఒక్కో హామీ ఇచ్చారని, వాటినే ప్రజలు అడుగుతున్నారన్నారు. రూ.20వేల కోట్ల ఆదాయం ముఖ్యం తప్పా ప్రజల మనోభావాలు పట్టవన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం అని, నేడు ఎన్నికల కోడ్ పేరుతో ముక్కుపిండి బిల్లులు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఆనాడు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని చెప్పి నేడు డబ్బులు కట్టాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రూ.2లక్షల రుణమాఫీ ఊసెత్తడం లేదని, పింఛన్లు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ నోటిఫికేషన్లకు సంబంధించిన ఉద్యోగాలకే నియామక ప్రతాలు అందించి తాము ఇచ్చినట్లు ఫోజులు కొడుతున్నారని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, అమీనోద్దీన్, కౌన్సిలర్లు రమేశ్‌రావు, కుత్బుద్దీన్, రమేశ్ పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీరం

పార్లమెంట్‌లో సత్తా చాటాలి

- రానున్న ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలి
- తెలంగాణను పచ్చబరిస్తే.. కాంగ్రెస్ ఎండబెడుతున్నది..
- వంద జాకీలు పెట్టినా రాహుల్‌గాంధీ లేచే పరిస్థితిలో లేడు
- కాంగ్రెస్, బీజేపీకి కేసీఆరే సరైనోడు : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి, మార్చి 6 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మండలకేంద్రంలోని రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీలకు గెలుపోటములు సహజమని, చాలా స్వల్ప ఓట్లతో అధికారం కోల్పోవడం జరిగిందన్నారు. అందుకు నిరుత్సాహపడకుండా పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ సత్తా చూపిద్దామన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు గెలిస్తే పార్లమెంట్‌లో తెలంగాణ గురించి కొట్లాడేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థి ఎవరనేది త్వరలోనే బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. అభ్యర్థులు ఎవరైనా వారి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీని వదిలి వెళ్లిన వారి గురించి ఎవరూ ఆలోచించాల్సిన అవసరం లేదని, ఇప్పుడు పార్టీ కోసం కష్టపడిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కాంగ్రెసోళ్లు బీజేపీ వారిపై ఎలాంటి ఆరోపణలు చేయకుండా కేసీఆర్‌ను తిట్టి ఓట్లు అడుగుతున్నారని, బీజేపీ వారు కాంగ్రెసోళ్లను కాకుండా కేసీఆర్‌ను తిట్టి ఓట్లు అడుగుతున్నారని, ఆ రెండు పార్టీల వారికి కేసీఆరే సరైనోడని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీకి వంద జాకీలు పెట్టినా లేచే పరిస్థితిలో లేడన్నారు. ప్రస్తుతం 548 పార్లమెంట్ స్థానాలకు కాంగ్రెస్‌కు కేవలం 55మాత్రమే ఉన్నాయన్నారు. గత పదేండ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని పచ్చబరిస్తే కాంగ్రెస్ కాలు మోపినప్పటినుంచి తిరిగి కరువుతో రాష్ట్రం అల్లాడుతున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం కోతికి కొబ్బరి చిప్ప ఇచ్చినట్లు ఉందని, ఆ పార్టీ ముఖ్యమంత్రి, మంత్రులు ఎవరు ఏం మాట్లాడుతున్నారో ఎవరికీ అర్థమవ్వ డం లేదన్నారు. ఎటుచూసినా సాగుచేసిన పంటలు ఎండుమొ హం పట్టి ఎండుతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు చలనం లేకుండా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తరతమ అనే భేదం లేకుండా పనులు చేశామని, ఎవరు వచ్చి నా పార్టీ లకతీతంగా పనులు చేసిపెట్టామన్నారు. మన కార్యకర్తలంతా అధైర్యపడకుండా నిక్కచ్చిగా పనిచేయాలని అధికారులు ఏమైనా పనులు చేయకపోతే పోట్లాడి చేయించుకోవాలని మీవెంటే ఉంటానని భరోసానిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీపీలు మన్యపురెడ్డి, దయాకర్, సింగిల్‌విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కుమార్‌యాదవ్, నాగేంద్రం యాదవ్, శశివర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వేణుయాదవ్‌తోపాటు ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చెంచుల జాతర భౌరాపూర్

- నేటి నుంచి నల్లమలలో ఉత్సవాలు ప్రారంభం
- శివరాత్రిన భ్రామరి, మల్లికార్జునుడి కల్యాణం
- ప్రకృతి సోయగాల మధ్య వెలిసిన క్షేత్రం
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వెలుగులోకి..

మల్లికార్జునస్వామి

లింగాల, మార్చి 6 : నల్లమల దట్టమైన అడవిలో.. ప్రకృతి సోయగాల మధ్య వెలసిన పుణ్యక్షేత్రం భౌరాపూర్. లింగాల మండలం అప్పాపూర్ చెంచుపెంట పంచాయతీ పరిధిలో చెంచుల ఆరాధ్య దైవమైన భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి కొలువయ్యారు. క్రీ.శ. 17వ శతాబ్దం నుంచి ఉన్న పురాతన ఆలయం. ప్రాచీనమైన ఆలయం గురించి పలు గ్రంథాల్లో ఉండడంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2016లో వెలుగులోకి వచ్చింది. గువ్వల బాలరాజు నాటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా.. ప్రభుత్వం శివరాత్రి పర్వదినాన చెంచుల పండుగను నిర్వహిస్తూ వస్తున్నది. ఇందులో భాగంగా ఈసారి 7, 8వ తేదీల్లో జాతర నిర్వహణకు ప్రభుత్వపరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శివరాత్రి రోజు భ్రామరి, మల్లికార్జునస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. చెంచు సంస్కృతి, సంప్రదాయం ప్రకారం కుల పెద్దల సమక్షంలో ఏటా కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

చెంచులు తమ ఆరాధ్యదైవంగా లింగమయ్య తర్వాత భౌరాపూర్‌లోని స్వామిని కొలుస్తారు. భ్రామరిని తోబుట్టువుగా భావిస్తారు. వేట కోసం వచ్చిన మల్లికార్జున స్వామి లోకకల్యాణార్థం భువిలో వెలసిన భ్రమరాంబను వివాహం చేసుకుంటాడు. దీంతో స్వామిని చెంచులు మల్లన్న బావగా పిలుచుకుంటారు. అందుకే ఇక్కడ చెంచులే పూజారులుగా వ్యవహరించే సంప్రదాయం నేటికీ కొనసాగుతున్నది. శ్రీశైల క్షేత్రానికి వెళ్లే భక్తులు, అడవిలో వెళ్లే బాటసారులు, వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి చెరువును నిర్మించారు. భౌరాపురంలోని భైరవుడిని పూజిస్తే ఎలాంటి భయం ఉండదని, క్రూరమృగాలు సైతం దాడులు చేయవని భక్తుల నమ్మకం. ఎంతో వైభవంగా విరాజిల్లిన ఆలయం నేడు పూజలకు నోచుకోలేని స్థితికి చేరుకున్నది.